



# కరపత్రం

SINCE 2014

మంగళవారం సెప్టెంబర్ 08, 2026 సంపుటి : 2 సంచిక : 328 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4




## కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి క్షమాపణ చెప్పాలి

- తాతా మధును డిస్మిస్ చేయాలి: కాంగ్రెస్ సభ్యులు
- స్పీకర్‌పై వ్యాఖ్యలతో అసెంబ్లీ దద్దరిల్లింది
- తాతా మధుపై చర్యలకు కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం మద్దతు
- బీఆర్ఎస్ సభ్యులను కేసీఆర్ ఉసిగొల్పారు: జూపల్లి
- స్పీకర్‌కు అవమానంపై సభ మొత్తం నిలవాలి: కడియం
- తాతా మధుతో పాటు కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి
- దళిత స్పీకర్‌ను తట్టుకోలేకపోతున్నారు: వంశీకృష్ణ
- తాతా మధును మాట్లాడించిన వారెవరో తేలాలి: వేముల వీరేశం

2లో..

అసెంబ్లీ స్పీకర్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలపై అసెంబ్లీ దద్దరిల్లింది. ఎమ్మెల్సీ తాతా మధును డిస్మిస్ చేయాలని సభ్యులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీపై చర్యలు తీసుకోవాల్సిందిగా సీఎం రేవంత్ తీర్మానానికి మద్దతు తెలిపిన కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం సభ్యులు.. తాతా మధును డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు.

తాతా మధు వ్యాఖ్యలపై 2026 సెప్టెంబర్ 7న అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి జూపల్లి కృష్ణారావు.. సమావేశాలకు ముందు రోజు బీఆర్ఎస్ సభ్యులను ఆ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఉసిగొల్పి పంపించారని అన్నారు. ప్రభుత్వనిర్ణయాలు తెలుసుకోండి కేసీఆర్ 80 వేల పుస్తకాలు చదవటం కాదు.. అనర్గళంగా మాట్లాడటం కాదు.. సంస్కారం కదా ముఖ్యం.. అని అన్నారు మంత్రి జూపల్లి. 2016లో ఎస్సీ వర్గీకరణ అంశంపై నిరసనకు దిగిన అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి, సంద్ర లను సభనుంచి డిస్మిస్ చేయడం జరిగింది. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్నారని మళ్లీ రేవంత్, సండ్రలను బహిష్కరించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉంటే అలా.. ప్రతిపక్షంలో ఉంటే ఇలా అని అన్నారు. పెద్దల సభ సభ్యుడు.. ఏ సంస్కారం చూసి ఆయనకు సభ్యత్వం ఇచ్చారో తెలయదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో అందరూ పుట్టుకతో సమానులే.. బతుకుదెరువు కోసం వృత్తులు వచ్చి ఉండొచ్చు.. దాన్ని బేస్ చేసుకొని అవమానకరంగా మాట్లాడితే తగదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్భాషలాడకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. తల్లిని మాట్లాడితే బాధ ఉండదా.. లోకంలో లేని వారి గురించి మాట్లాడటం శిక్షార్హులే.. ఇలాంటివి జరగకుండా ఉండాలంటే వంద శాతం సభ్యత్వాన్ని రద్దు చేయాల్సిందేనని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.



## స్పీకర్‌పై ఘోరమైన భాష.. కేసీఆర్ స్పందించాలి

- తాతా మధు వ్యాఖ్యలను బీఆర్ఎస్ ఖండించాలి
- స్పీకర్ తల్లిని దూషించేలా వ్యాఖ్యలు సరికాదు
- పోలీసులపై కేటీఆర్ దాడి చేసినట్లు కనిపిస్తోంది
- ప్రజాప్రతినిధులు హుందాగా ప్రవర్తించాలి
- సభా గౌరవాన్ని తగ్గించేలా టీషర్టులపై నినాదాలు
- స్పీకర్‌కు క్షమాపణ చెప్పాల్సిందే
- అవిశ్వాస తీర్మానం బెదిరింపులకు భయపడం

హైదరాబాద్:
స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు సభ్య సమాజం అసహ్యించుకునే భాష మాట్లాడారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. స్పీకర్‌పై అంత ఘోరమైన భాష ఉపయోగించడం సరికాదన్నారు. ఈ ఘటనపై స్పందించాల్సిన బాధ్యత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు ఉందన్నారు. కేసీఆర్ స్పందించకుంటే ఆయనే ప్రేరేపించారన్న అనుమానాలు వస్తాయన్నారు. పార్టీ నేతలతో కలిసి శ్రీధర్‌బాబు మీడియా సమావేశం నిర్వహించారు.

### పోలీసులపై కేటీఆర్ చేయిచేసుకున్నట్లు కనబడుతోంది..

"సీనియర్ శాసనసభ్యుడిగా ఉన్న వ్యక్తి పోలీసులపై దాడి చేశారు. ఓ శాసనసభ్యుడు యూనిఫామ్‌లో ఉన్న వ్యక్తి కాలర్ పట్టుకున్నారు.

2లో..




## తెలంగాణలో ఎస్ఐఆర్ గడువు పొడిగింపు

హైదరాబాద్:
తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును పొడిగించారు. అభ్యంతరాలను స్వీకరించే గడువు గత షెడ్యూల్ ప్రకారం సెప్టెంబరు 16 వరకు ఉంది. అయితే, దీన్ని ఇప్పుడు అక్టోబరు 7 వరకు పొడిగించారు. తుది జాబితాను గత షెడ్యూల్ ప్రకారం..

2లో



## నల్లదుస్తులతో వస్తే తప్పేంటి?: సబిత ఫైర్

హైదరాబాద్:
తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సోమవారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నల్ల దుస్తులు ధరించి బీఆర్ఎస్‌నేతలు అసెంబ్లీకి చొచ్చుకొళ్లేందుకు ప్రయత్నించడంతో తీవ్ర గందరగోళం నెలకొంది.



## ఉద్యోగాల పేరిట మోసం.. ఎమ్మెల్యే పీఏ అరెస్ట్

భద్రాచలం:
ఉద్యోగాల పేరిట మోసం చేసిన భద్రాచలం ఎమ్మెల్యే పీఏ కల్యాణ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. భద్రాచలం వాసి రాయల శ్రీను ఫిర్యాదుతో కేసు నమోదు అయింది. నిరుద్యోగుల నుంచి సుమారు రూ.8కోట్లు వసూలు చేసినట్లు కల్యాణ్‌పై ఆరోపణలు ఉన్నాయి. 54 మందిని ఆయన మోసం చేసినట్లు సమాచారం. బెట్టింగులకు అలవాటుపడి కల్యాణ్ డబ్బు పోగొట్టుకున్నట్లు సమాచారం.

## అట్టడుగు వర్గాల బిడ్డలమనేనా.. ఇంత అవమానం?



- » స్పీకర్‌ను అవమానించిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టాలి
- » తాతా మధు వ్యాఖ్యలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి
- » దళిత స్పీకర్‌ను కేసీఆర్ గౌరవించడం లేదు: సీతక్క
- » స్పీకర్ తల్లిని అవమానించడం బాధాకరం
- » తాతా మధును వెంటనే డిస్మిస్ చేయాలి
- » బీఆర్ఎస్ తీరుపై సభలో సీతక్క భావోద్వేగం

2లో



## ఓలా, ఉబర్, ర్యాపిడో తరహాలో ప్రభుత్వ యాప్

- » ఆటో డ్రైవర్ల ప్రయోజనం కోసం ప్రత్యేక యాప్
- » యాప్ ఏర్పాటుపై ఐటీ శాఖకు లేఖ
- » ఆటో కార్మికుల సంక్షేమ బోర్డుపై చర్యలు
- » ఆటో ఛార్జీల పెంపునకు ప్రభుత్వం సిద్ధం
- » 2012 తర్వాత ఛార్జీలు పెరగలేదు: పొన్నం
- » ఛార్జీల పెంపుపై కమిటీ ఏర్పాటు
- » ఈవీ ఆటోల 'లాస్ట్ మైల్' పాలసీపై ప్రచారంలో వాస్తవం లేదు

2లో

## మా ఆడబిడ్డలకు క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టం: కేటీఆర్



- మా ఆడబిడ్డలకు క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టం: కేటీఆర్
- సబితా ఇంద్రారెడ్డిపై దాడికి సీఎం రేవంత్‌దే బాధ్యత: కేటీఆర్
- మహిళలపై దాడిని కప్పిపుచ్చేందుకే డైవర్షన్ పాలిటిక్స్
- జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయిస్తాం
- స్పీకర్‌పై అవిశ్వాసంపై ఆలోచిస్తాం
- అసెంబ్లీని నెలరోజులు నిర్వహించాలి: కేటీఆర్

2లో



2లో..

## మాటిస్తే నిలబడతాం.. ఏదైనా ఎదుర్కొంటాం: కొండా సురేఖ

హైదరాబాద్:
మాటిస్తే నిలబడతామని.. ఎంతటి కష్టాన్ని అయినా ఎదుర్కొంటామని మాజీ మంత్రి కొండా సురేఖ ఆమె భర్త కొండా మురళి అన్నారు.

## ఇరిగేషన్‌లో కేసీఆర్ తప్పులే ప్రస్తుత సమస్యలకు కారణం

- కాళేశ్వరంపై కేసీఆర్ ఇంకా మాట్లాడటం సిగ్గుచేటు
- కాళేశ్వరం నిర్మాణానికి రూ.లక్ష కోట్లు ఖర్చు
- సరిగా నిర్మించకపోవడం వల్లే ప్రస్తుత సమస్యలు
- నీటి సమస్యకు ఎల్‌నినో.. కేసీఆర్ రెండు కారణాలు
- నీటి పంపకాలతో తెలంగాణకు కేసీఆర్ అన్యాయం
- కేసీఆర్ ఇరిగేషన్ శాఖను నాశనం చేశారు: ఉత్తమ్

హైదరాబాద్:
కాళేశ్వరం ప్రాజెక్టుపై కేసీఆర్ ఇంకా మాట్లాడటం సిగ్గుచేటని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో మంత్రి ఉత్తమ్ చిట్‌చాట్‌గా మాట్లాడారు. "నేనే ఇంజనీర్ అంటూ కేసీఆర్ కాళేశ్వరం కట్టించి.. చివరకు కూల్చేశారు. కాళేశ్వరం నిర్మాణానికి లక్ష కోట్లు ఖర్చు చేసినా.. సరిగా నిర్మించకపోవడం వల్లే ప్రస్తుత సమస్యలు వచ్చాయి. నీళ్ల సమస్యకు రెండు కారణాలు ఉన్నాయి..



ఒకటి ఎల్‌నినో, మరొకటి కేసీఆర్. నీటి పంపకాల విషయంలో కేసీఆర్ తెలంగాణకు అన్యాయం చేశారు. ఇరిగేషన్ శాఖను నాశనం చేశారు. ఇరిగేషన్ విషయంలో కేసీఆర్ చేసిన తప్పుల వల్లే ప్రస్తుత సమస్యలు ఎదురవుతున్నాయి. ఆయన మాట్లాడిన భాష వల్లే తెలంగాణ భాషకు చెడ్డ పేరు వచ్చింది" అని ఉత్తమ్ ఆరోపించారు.

## నా మాటలపై విచారం వ్యక్తం చేస్తున్నా: ఎమ్మెల్సీ తాతా మధు

హైదరాబాద్:
శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అంటే తనకు గౌరవముందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. అనని మాటలను తనకు ఆపాదించడం సరికాదని చెప్పారు. "స్పీకర్‌ను నేనేమీ అనలేదు. ఆయన్ను అన్నట్లు భావిస్తే నా వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నా. నా మాటలపై విచారం వ్యక్తం చేస్తున్నా. నాపై దాడి చేసి గొంతు నొక్కే ప్రయత్నం చేశారు. నాపై దాడి చేసిన వారిని మాత్రమే ఆవేశంతో అన్నాను" అని తాతా మధు వివరణ ఇచ్చారు.



2లో..

# తెలంగాణలో ఎస్ఐఆర్ గడువు పొడిగింపు

మొదటి పేజీ తరువాయి
అక్టోబరు 19న ప్రకటించాల్సి ఉండగా, రివైజ్డ్ షెడ్యూల్ ప్రకారం ఇప్పుడు నవంబరు 9న ప్రకటిస్తారు.

**సీఈవో కీలక సమావేశం**

తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో) సుదర్శన్ రెడ్డి సోమవారం అదనపు సీఈవో డాక్టర్ వసం వెంకటేశ్వర్ రెడ్డి, ఉప సీఈవో జి.ఎస్. చారి కలిసి ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)-2026పై జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు (డీఈఓలు), ఓటరు నమోదు అధికారులు (ఈఆర్ఓలు)తో వీడియో సమావేశం నిర్వహించారు.

సమావేశంలో ఎస్ఐఆర్-2026 కింద నోటీసుల పంపిణీ, విచారణల నిర్వహణకు సంబంధించిన అంశాలపై ఆయన దృష్టి సారించి, ఈ కింది సూచనలు చేశారు.

నోటీసుల పంపిణీ: ప్రతి నోటీసును సంబంధిత ఓటరుకు బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ) వ్యక్తిగతంగా అందజేసేలా చూడాలి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల చిరునామాలను గుర్తించేందుకు బూత్ స్థాయి ఏజెంట్ల (బీఎల్ఏలు) సహాయం బీఎల్ఓలు తీసుకోవాలి.

పెండింగ్ కేసుల పరిష్కారం: జిల్లాలకు అందించిన అదనపు లాగిన్‌లను వినియోగించి పెండింగ్ కేసులను సకాలంలో పరిష్కరించేలా చూడాలి.

అన్-మ్యాపింగ్, అసాధారణ కేసుల జాబితాలు: రాజకీయ పార్టీల సమావేశాల్లో అన్-మ్యాపింగ్, అసాధారణతల కేసుల జాబితాలను రాజకీయ పార్టీలకు అందజేయాలి. క్లెయిమ్‌లు, అభ్యంతరాల కాలంలో బీఎల్ఏలు చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించాలి.

పత్రాల అప్‌లోడ్: భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, ఏఈఆర్ఓలు పత్రాలను సరిగ్గా అప్‌లోడ్ చేయాలి. కంప్యూటర్ ఆపరేటర్లు ఎలాంటి తప్పులు చేయకూడదు. వారి పర్యవేక్షణలో కంప్యూటర్ ఆపరేటర్లు చేసిన తప్పులకు ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు బాధ్యత వహించాలి.

విచారణ కేంద్రాలు ఏర్పాటు చేయని ప్రాంతాల్లో వృద్ధులు, దివ్యాంగుల (పీడబ్ల్యూడీలు) ఇళ్లకు సూపర్‌వైజర్లు వెళ్లాలని ఆదేశించారు. ఓటర్లకు సహాయం చేసేందుకు ఈఆర్ఓ, డీఈఓ స్థాయిలో సహాయ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలి.

అదనంగా, నోటీసుల అందజేత, విచారణల షెడ్యూల్, ఈఆర్ఓ, డీఈఓ లాగిన్‌లలో పెండింగ్ కేసుల పరిష్కారంపై అన్ని జిల్లాల డీఈఓలతో ప్రధాన ఎన్నికల అధికారి పురోగతిని సమీక్షించారు.

# స్పీకర్‌పై ఘోరమైన భాష.. కేసీఆర్ స్పందించాలి

మొదటి పేజీ తరువాయి
పోలీసులపై దాడి చేయడం మీడియా ఛానళ్లలో స్పష్టంగా కనిపించింది. పోలీసులపై కేటీఆర్ చేయిచేసుకున్నట్లు కనబడుతోంది. పోలీసు సిబ్బంది గొంతు నొక్కుతున్నట్లు కనిపించింది. ఉమ్మడి రాష్ట్రంలోనూ పోలీసులపై ఇలాంటి ఘటనలు జరగలేదు. ప్రజాప్రతినిధులు హుందాగా ప్రవర్తించాలి. బీఆర్ఎస్ సభ్యుల తీరు చాలా దారుణంగా ఉంది. అసెంబ్లీలోకి బ్యాడ్జీలు తీసుకురాకూడదని గత బీఆర్ఎస్ ప్రభుత్వమే రూల్స్ రూపొందించింది. రూల్స్‌కు అనుగుణంగానే స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. టీషర్టుపై నినాదాలు ఉంటే అనుమతించకూడదనే నిబంధన ఉంది.

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఒక న్యాయం, మాకో న్యాయమా అని కేటీఆర్ అంటున్నారు. రాహుల్ టీషర్టుపై ఏదీ రాసుకుని లోక్‌సభకు వెళ్లలేదు. సభా గౌరవాన్ని తగ్గించేలా బీఆర్ఎస్ సభ్యులు టీషర్టులపై నినాదాలు ఉన్నాయి. గతంలో ప్లకార్డులు అనుమతించరని చెబితే మేము తీసుకెళ్లలేదు. మహిళా సభ్యులకు ఇబ్బంది జరిగిందని తెలియగానే సీఎం సమీక్ష చేశారు. ఏవైనా లోటుపాట్లు జరిగితే మా ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుంది.

**ఆ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు**

తాతా మధు వ్యాఖ్యలకు బీఆర్ఎస్ బాధ్యత వహించాలి. ఆయన వ్యాఖ్యలను బీఆర్ఎస్ ఎందుకు ఖండించలేదు. స్పీకర్ తల్లిని దూషించేలా వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసం?. దళిత వ్యతిరేక పార్టీగా బీఆర్ఎస్ నిరూపించుకుంది. తాతా మధు వ్యాఖ్యలు విని స్పీకర్ కన్నీరు పెట్టుకున్నారు. బీఆర్ఎస్ నేతలు ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ పోలీసులను బెదిరిస్తున్నారు. శాసనసభను దుశ్శాసన సభ అని కేటీఆర్ అవమానించారు. మహిళల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు. మహిళా మంత్రి లేకుండా ఐదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నడిపింది. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెడతామని కేటీఆర్ బెదిరిస్తున్నారు. ఆ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు. స్పీకర్‌కు క్షమాపణ చెప్పాల్సిందే. ఆ తర్వాతే మిగతా కార్యకలాపాలు ఉంటాయి. అసెంబ్లీ ప్రాంగణానికి సంబంధించి పూర్తిస్థాయి అధికారం స్పీకర్, ఛైర్మన్‌కే ఉంటుంది" అని శ్రీధర్‌బాబు అన్నారు.

# కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి క్షమాపణ చెప్పాలి

మొదటి పేజీ తరువాయి

**సీరియస్ ఇష్యూను బీజేపీ డైవర్ట్ చేయడానికి చూస్తోంది: ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

ఇది అత్యంత బాధాకరమైన పరిస్థితి అని అన్నారు ఎమ్మెల్యే కడియం శ్రీహరి. ఈ ఘటనపై తెలంగాణ వ్యాప్తంగా ఉన్న దళితులు బాధపడుతున్నారు. 22ఏ పై బీజేపీ నేతలు ఇప్పుడు డిమాండ్ చేయడం తగదని.. సీరియస్ ఇష్యూను డైవర్ట్ చేయవద్దు, డైల్యూట్ చేయవద్దని అన్నారు. ఆ విషయాన్ని ప్రస్తుతం వాయిదా వేసుకోవాలని.. లేదంటే బీజేపీ, బీజేఎల్పీ ఈ ఇష్యూని డైవర్ట్ చేయాలని చూస్తుందని భావించాల్సి వస్తుందన్నారు.

స్పీకర్ కు జరిగిన అవమానంపై చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. శాసన సభ సభాపతికే గౌరవం లేకపోతే, రక్షణ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. స్పీకర్ కు అండగా ఉండేందుకు సభ మొత్తం ముక్త కంఠంతో నిలవాల్సిన అవసరం ఉందన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చొక్కాలు విప్పేసే పోలీసుల మీదికి, రౌడీలు, గూండాల మాదిరిగా వెళ్లటం పద్ధతి కాదన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు ఖండిస్తున్నానని.. బడుగు బలహీన వర్గాలపై ఇలాంటి వ్యాఖ్యలు సరికాదని అన్నారు. సీఎం ప్రవేశ పెట్టిన తీర్మానానికి మద్దతు ఇస్తున్నామని.. ఎమ్మెల్సీపై చర్యలు తీసుకోవాల్సిందేనని అన్నారు.

**దళితుడు స్పీకర్ గా ఉంటే తట్టుకోలేక పోతున్నరు: ఎమ్మెల్యే వంశీకృష్ణ**

స్పీకర్ పై ఇలాంటి మాటలు మాట్లాడటం తగదని అన్నారు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ. రాకెట్ యుగంలో ఇలాంటి వివక్ష కొనసాగటం అత్యంత బాధాకరమని అన్నారు. రాజ్యాంగాన్ని రాసిన అంబేద్కర్ దళితుడు, తెలంగాణ రాష్ట్ర బిల్లును ప్రవేశ పెట్టింది అప్పటి స్పీకర్ మీరాకుమార్ దళితురాలు, ఏఐసీసీ అధ్యక్షులు ఖర్గే దళితులేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రపంచపటాలు పరిశీలించండి

స్పీకర్ పై ఇలాంటి వ్యాఖ్యలు బాధాకరమని అన్నారు. తాతా మధుతో పాటు కౌశిక్ రెడ్డిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనికి ముఖ్య కారణం కేసీఆర్ అని అన్నారు. సభకు వస్తే దళిత స్పీకర్ ను అధ్యక్షా అనాల్సి వస్తుందని.. అందుకే కేసీఆర్ అసెంబ్లీకి రావటం లేదన్నారు. సీఎం రేవంత్ ను చూస్తే కేసీఆర్ కు భయం వేస్తున్నట్లు అనిపిస్తుందన్నారు.

తాతా మధుతో మాట్లాడించిన వాళ్లు ఎవరో తేలాలని అన్నారు ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే వేముల వీరేశం. స్పీకర్ ను అవమానించడం లక్ష్యంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. మాట్లాడించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మాటిస్తే నిలబడతాం.. ఏదైనా ఎదుర్కొంటాం: కొండా సురేఖ

మొదటి పేజీ తరువాయి
ఈ మేరకు సోషల్ మీడియాలో కొండా సురేఖ ఓ వీడియోను షేర్ చేశారు. "కొండా మురళి మాటిస్తే తల తాకట్టు పెట్టయినా నెరవేరుస్తారు. ఆయన మాటిచ్చారంటే ఆస్తి అమ్మి అయినా చేయాల్సిందే" అని అన్నారు. ఇటీవల కొండా సురేఖను తెలంగాణ మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

# ఇస్రో ప్రైవేటీకరణ ఉండదు - ఛైర్మన్ వి.నారాయణన్



ఇస్రో ప్రైవేటీకరణపై ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనలకు ఆ సంస్థ ఛైర్మన్ వి.నారాయణన్ తెరదించారు. ఇస్రోను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని చెప్పారు. ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనలపై వారితో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం పెరిగినా.. ఇస్రోకు ముప్పు లేదని తెలిపారు. బెంగళూరు స్పేస్ ఎక్స్‌పోలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.అంతరిక్ష రంగంలో ప్రైవేటు పరిశ్రమల పాత్ర కొత్తదేమీ కాదని నారాయణన్ పేర్కొన్నారు. విస్తృత బాధ్యతలు చేపట్టేలా ఇస్రో మరింత శక్తిమంతంగా మారుతుందన్నారు. ప్రస్తుతం సుమారు 450 పరిశ్రమలు ఇస్రోతో కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. దేశ అవసరాలకు ఏటా దాదాపు 50 లాంచ్ వెహికిల్స్ అవసరమని.. ఆ స్థాయిలో ప్రయోగ సామర్థ్యాన్ని పెంచాలంటే ఇస్రోతో పాటు మరింత విస్తృత వ్యవస్థ కీలకమన్నారు.

# గాల్లో ఉండగా.. విమానం ఇంజిన్‌లో తగ్గిపోయిన ఆయిల్




ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన ఓ విమానం గాల్లో ఉండగా ఇంజిన్‌లో సమస్య తలెత్తింది. దీంతో ఆ విమానాన్ని వెనక్కి మళ్లించి ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. ఈ విమానం సోమవారం ఉదయం కేరళలోని కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అబుధాబికి బయల్దేరింది. టేకాఫ్ అయిన సుమారు 50 నిమిషాల తర్వాత.. మొదటి ఇంజిన్‌లో ఆయిల్ తగ్గడాన్ని పైలట్లు గుర్తించారు. ఆయిల్ ప్రెజర్ ప్రమాదకర స్థాయికి చేరడంతో వెంటనే ఆ ఇంజిన్‌ను ఆపివేశారు. మిగిలిన ఒకే ఇంజిన్‌తో ప్రయాణం కొనసాగించడం కష్టం కావడంతో విమానాన్ని వెనక్కి మళ్లించారు.ఒకే ఇంజిన్‌తో 45నిమిషాల పాటు ప్రయాణించిన ఆ విమానం పైలట్ల అప్రమత్తతో సురక్షితంగా కొచ్చి విమానాశ్రయంలో దిగింది. దీనిపై విమానయాన సంస్థ స్పందించింది. ఘటనకు దారి తీసిన పరిస్థితులపై అంతర్గత విచారణ కొనసాగుతోందని తెలిపింది. మరోవైపు ఈ ఘటనపై అధికారిక దర్యాప్తు చేపట్టాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ సంబంధిత అధికారులను ఆదేశించింది.

**అమృత్‌సర్ ఎయిర్‌పోర్టు వద్ద డ్రోన్‌ల కలకలం..**

అమృత్‌సర్ ఎయిర్‌పోర్టు వద్ద అనుమానాస్పద డ్రోన్‌లు కలకలం సృష్టించాయి. ఈ విమానాశ్రయం భారత్- పాక్ సరిహద్దులకు సమీపంలో ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్త చర్యగా ఏడు విమానాలను దారి మళ్లించామని.. కొన్ని గంటలపాటు ఎయిర్‌పోర్టులో కార్యకలాపాలను నిలిపివేశామని వెల్లడించారు. విమానాశ్రయ ప్రహరీ గోడ వెలుపల పలు డ్రోన్లు అనుమానాస్పదంగా ఎగురుతూ కనిపించినట్లు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వెల్లడించింది.

# లంచాలను ఈఎంఐల్లాగా ఇవ్వాల్సి వచ్చింది: డీఎంకేపై విజయ్ తీవ్ర విమర్శలు

తమిళనాడు అసెంబ్లీ వేదికగా ప్రతిపక్ష పార్టీ డీఎంకేపై సీఎం విజయ్ విరుచుకుపడ్డారు. బ్యాంకు రుణాలకు ఈఎంఐలు కట్టినట్టుగా వాయిదాల పద్ధతిలో ప్రభుత్వ కాంట్రాక్టర్లు ఆ ప్రభుత్వానికి లంచాలు ఇచ్చుకోవాల్సి వచ్చిందని విమర్శలు గుప్పించారు. దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పొందుపర్చిన వివరాల ఆధారంగా తాను ఈ విమర్శలు చేస్తున్నట్లు చెప్పారు. కాంట్రాక్ట్ విలువలో ఆ మొత్తం 10 శాతం వరకు ఉండేదన్నారు.

# మా ఆడబిడ్డలకు క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టం: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి
బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దుర్మార్గంగా ప్రవర్తించారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీ వద్ద పోలీసులు వ్యవహరించిన తీరును రాష్ట్రం మొత్తం చూసిందన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.
"సబితా ఇంద్రారెడ్డి జుట్టు పట్టుకుని గొంతు నొక్కే ప్రయత్నం చేశారు. ఆమెపై దాడికి బాధ్యుడు సీఎం రేవంత్‌రెడ్డే . కోవా లక్ష్మి లేకుంటే సునీతా లక్ష్మారెడ్డి ఇనుప కంచెలపై పడేవారు. శాసనసభ దుశ్శాసన పర్వంలా మారింది. డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్, డైవర్షన్ మాత్రమే రేవంత్‌కు తెలుసు. మహిళలపై దాడిని కప్పిపుచ్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేశారు. మమ్మల్ని ఆపాలని స్పీకర్ చెప్పారంటూ పోలీసులు చెబుతున్నారు"

**స్పీకర్‌పై అవిశ్వాసం.. ఆలోచిస్తాం**

"మేం నిలదీస్తామని తెలిసే.. మమ్మల్ని అసెంబ్లీకి రాకుండా అడ్డుకున్నారు. మా ఆడబిడ్డలకు క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టం. హోంమంత్రిగానూ ఉన్న రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాల్సిందే. ఈ అంశాన్ని ఇక్కడితో వదిలిపెట్టం.. జాతీయ మహిళా కమిషన్ దగ్గరకూ వెళ్తాం. ప్రజా సమస్యలు చాలా ఉన్నాయి.. అసెంబ్లీని నెలరోజులు నిర్వహించాలి. సీఎంను విమర్శిస్తే మైక్ ఇవ్వను అనడమేంటి? స్పీకర్‌పై అవిశ్వాసం పెట్టే అంశంపై ఆలోచిస్తాం" అని కేటీఆర్ అన్నారు.

# అట్టడుగు వర్గాల బిడ్డలమనేనా.. ఇంత అవమానం?: మంత్రి సీతక్క

మొదటి పేజీ తరువాయి
బీఆర్ఎస్ సభ్యుల తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందని తెలంగాణ మంత్రి సీతక్క విమర్శించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై ఆ పార్టీ సభ్యుడు తాతా మధు అత్యంత హేయమైన భాష వాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్‌ను అవమానించిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలన్నారు. శాసనసభలో సీతక్క మాట్లాడారు.
"తాతా మధు వ్యాఖ్యలకు ప్రతిపక్ష నేత కేసీఆర్ బాధ్యత వహించి క్షమాపణ చెప్పాలి. ఆయన డైరెక్షన్‌లోనే బీఆర్ఎస్ సభ్యులు ఇలా మాట్లాడారు. దళితులంటేనే ఆ పార్టీకి నచ్చదు. స్పీకర్‌గా దళితుడు ఉండటం కేసీఆర్‌కు నచ్చదు. దళితుడైన స్పీకర్‌ను అధ్యక్షా అనాల్సి వస్తుందనే ఆయన అసెంబ్లీకి రావడం లేదు. గతంలో సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క ఉంటే ఓర్వలేక ఆయన్ను తొలగించారు. గతంలో జగదీశ్‌రెడ్డి కూడా ఇదే తరహాలో మాట్లాడారు. స్పీకర్ తల్లిని అవమానించడం బాధాకరం. ఆయన ఉన్నత స్థాయికి వెళ్లినందుకు తల్లిని అవమానించాలా?అట్టడుగు వర్గాల బిడ్డలమనేనా.. మనకింత అవమానం? "అంటూ సీతక్క ఒకింత భావోద్వేగానికి గురయ్యారు.

# నా మాటలపై విచారం వ్యక్తం చేస్తున్నా: ఎమ్మెల్సీ తాతా మధు

మొదటి పేజీ తరువాయి
స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో మండిపడింది. శాసనసభలో సీఎం రేవంత్ సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఆయన వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కూడా తాతా మధు వ్యాఖ్యలను ఖండించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని పలువురు నేతలు కోరారు. ఈ నేపథ్యంలో తాతా మధు స్పందించారు.

# ఓలా, ఉబర్, ర్యాపిడో తరహాలో ప్రభుత్వ యాప్

మొదటి పేజీ తరువాయి
ఆటో డ్రైవర్లకు ప్రయోజనం చేకూరేలా ఓలా, ఉబర్, ర్యాపిడో తరహాలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్ రూపొందించే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ మేరకు ఐటీ శాఖ మంత్రికి ఇప్పటికే లేఖ రాసినట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు.ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించి అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. టీజీఎస్ఆర్టీసీ ద్వారా ఈవీ ఆటోలను ప్రవేశపెట్టి 'లాస్ట్ మైల్ కనెక్టివిటీ' పాలసీ తీసుకురానున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం అలాంటి విధానంపై ఎలాంటి చర్చ జరగడం లేదని తెలిపారు.ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కార్మిక శాఖతో కలిసి ప్రాధాన్యతా ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఈ అంశాన్ని కేబినెట్‌లో చర్చించి, అనంతరం శాసనసభలో ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.
2012 తర్వాత ఆటో ఛార్జీలు పెంచలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఛార్జీలను పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.ఛార్జీల పెంపుపై రవాణా శాఖ అధికారులు, ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర ప్రతిపాదనలు రూపొందించనున్నట్లు తెలిపారు. ఎంత మేర ఛార్జీలు పెంచాలనే అంశంపై కమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని, ఆ నివేదిక ఆధారంగా త్వరలో ఛార్జీల పెంపును అమలు చేస్తామని మంత్రి వెల్లడించారు.

# నల్లదుస్తులతో వస్తే తప్పేంటి?: సబిత ఫైర్

మొదటి పేజీ తరువాయి
ఈ సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలతో పోలీసులు వ్యవహరించిన తీరుపై మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. తన జుట్టు పట్టుకుని బలవంతంగా వాహనంలోకి ఎక్కించారని, నల్ల దుస్తులు ధరించి అసెంబ్లీకి వస్తే తప్పేంటని ఆమె మండిపడ్డారు.
కాంగ్రెస్‌నేత రాహుల్‌గాంధీ నల్లదస్తులతో పార్లమెంట్‌కు వెళితే తప్పులేనప్పుడు తాము అదే తరహాలో నిరసన చేపడితే తప్పు ఏంటి అని ఆమె ప్రశ్నించారు. దీనిపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. మనుపెన్నడూ ఇలాంటి పాలన చూడ లేదన్నారు. పోలీసులు ముసుగులో రౌడీలను దించారని.. రాజ్యాంగాన్ని ఖూనీ చేశారని ఇతర మహిళా నేతలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అంటూ వారు ఆవేదన వ్యక్తంచేశారు.
మరోవైపు అసెంబ్లీ లోపలికి వెళ్తున్న సమయంలో పోలీసులు ఇష్టానుసారంగా తోసేశారు, చీర లాగేశారని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఆరోపించారు. ఎలాంటి ప్లకార్డులు లేకుండా లోపలికి వెళ్లాం, కాలికి గాయమైంది. స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తామని ఇలాంటి పాలన ఎప్పుడూ చూడలేదంటూ విమర్శించారు. పోలీసుల ప్రవర్తనకు ఆమె తీవ్ర ఆవేదనతో కన్నీళ్లు పెట్టుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఇది చీకటి రోజని అభివర్ణించారు. ఈ నిరసనల నేపథ్యంలో పోలీసులు, బీఆర్ఎస్‌నేతల మధ్య జరిగిన తోపులాటలో మాజీ మంత్రులు కేటీఆర్,హరీష్ రావు, జగదీష్‌రెడ్డి, తదితర నేతలను అదుపులోకి తీసుకున్నారు.

# హెచ్ఐవి/ఎయిడ్స్ చిన్నారులకు
# లోయోలా అకాడమీ విద్యార్థుల భరోసా




▪ కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి

సమాజంలో వెనుకబడిన, ఆదరణకు నోచుకోని వర్గాలకు అండగా నిలవడమే నిజమైన సామాజిక బాధ్యతని లోయోలా అకాడమీ డిగ్రీ & పీజీ కళాశాల విద్యార్థులు నిరూపించారు.
కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ప్లానెట్' (PLANET) సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా, బి.కామ్ (డిజిటల్ మార్కెటింగ్) ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సోమవారం తేదీ 7- 9- 2026 రోజున హైదరాబాద్ ఐడీఏ బొల్లారం, బాచుపల్లి లోని 'డిజైర్ సొసైటీ' (Desire Society) ని సందర్శించారు.



అక్కడ హెచ్ఐవి/ఎయిడ్స్ (HIV/AIDS) తో జీవిస్తున్న చిన్నారులను కలిసి, వారికి ఆప్యాయతను పంచుతూ ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.

▪ కళాశాల వైస్-ప్రిన్సిపాల్స్ ఫాదర్ బి. పీటర్, ఫాదర్ అనిల్ కుమార్, కరస్పాండెంట్ ఫాదర్ ఎ. రెక్స్ ఏంజెలియో, ఫాదర్ డాక్టర్ ఎన్. బి. బాబుల మార్గదర్శకత్వంలో, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ శ్రీ స్టీఫెన్ అసిర్వాదం సమన్వయం, పర్యవేక్షణలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

ఈ సందర్భంగా డిజైర్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ నీలిమ, ప్రాజెక్ట్ హెడ్ శ్రీ వెంకటేష్ విద్యార్థులతో మాట్లాడారు. హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలతో పాటు ఈ వ్యాధిగ్రస్తులపై సమాజంలో ఉన్న అపోహలు, వివక్షను తొలగించాల్సిన అవసరాన్ని వారు వివరించారు.
అనంతరం విద్యార్థులు చిన్నారులతో ఆత్మీయంగా మమేకమై వారి ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, సంరక్షణ మరియు విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి మార్గదర్శకత్వం చేశారు. చిన్నారులతో గడిపిన ఈ క్షణాలు తమను ఎంతగానో కదిలించాయని, తమలో సామాజిక బాధ్యతను, సానుభూతిని మరింత పెంచాయని విద్యార్థులు భావోద్వేగంతో పంచుకున్నారు.
బాధితులకు భవిష్యత్తులోనూ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

# సింగరేణి పెన్షన్ పెంచాలని
# రిటైర్డ్ ఉద్యోగుల డిమాండ్



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి పరిధిలోని ఘట్ కేసర్ సర్కిల్ చౌదరి గూడలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు 1998 నాటి కోల్ మైన్స్ పెన్షన్ స్కీమ్‌లో కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తున్న వాటాను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పెంచాలని సోమవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ నిరసనను తెలియజేశారు. ఈ పెన్షన్ పథకంలో కేంద్ర ప్రభుత్వ వాటాను పెంచాలని వారు కోరుతున్నారు.

# హన్మకొండలో టీఆర్ఎస్ శంఖారావం
# తరాలపల్లిలో పార్టీ జెండా ఆవిష్కరించిన కవిత




▪ ప్రజల అజెండాతో ముందుకు సాగుతామని స్పష్టం
▪ టిఆర్ఎస్ పార్టీ చీఫ్ కవితకు ఘన స్వాగతం పలికిన గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్ రావు

**కరపత్రం ప్రతినిధి హన్మకొండ, సెప్టెంబర్ 7**
తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ రాష్ట్ర వ్యాప్త విస్తరణలో భాగంగా పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత సోమవారం వరంగల్ పర్యటన చేపట్టారు. పర్యటనలో భాగంగా హన్మకొండ జిల్లా కేంద్రంలో విద్యార్థులతో కలిసి నిరాహార దీక్షలో పాల్గొన్న పార్టీ చీఫ్ కవిత, అనంతరం తరాలపల్లి గ్రామానికి చేరుకుని పార్టీ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు, పార్టీ శ్రేణులు, యువత, మహిళలు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై కవితకు ఘన స్వాగతం పలికారు. జై తెలంగాణ, టీఆర్ఎస్ నినాదాలతో తరాలపల్లి మారుమోగింది. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను




అందించాలనే సంకల్పంతోనే తెలంగాణ రక్షణ సేనను స్థాపించినట్లు తెలిపారు. ప్రజలకు మంచి చేయాలనే దృఢ సంకల్పంతో తమ పార్టీ ముందుకు వస్తోందని, అధికార రాజకీయాలకు భిన్నంగా ప్రజల సమస్యలే తమ అజెండా అని స్పష్టం చేశారు. విద్య, వైద్యం ప్రతి పేద కుటుంబానికి భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేసిన కవిత, ఈ రెండు రంగాల్లో ప్రజల జేబు నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు కాకుండా చేసే విధానాలే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందుబాటులోకి రావాలని తమ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. "గత ఇరవై ఏళ్లుగా మీ మధ్య ఉన్న ఆడబిడ్డను నేను. మీ ఆశీర్వాదంతోనే ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ఈ పార్టీని ఏర్పాటు చేశాను. సమాజంలోని ప్రతి వర్గానికి సామాజిక న్యాయం జరిగేలా, ప్రతి కుటుంబానికి అభివృద్ధి ఫలాలు అందేలా పనిచేస్తాం" అని ఆమె అన్నారు. పార్టీ జెండా గురించి ప్రస్తావిస్తూ, "మన జెండాలోని పసుపు రంగు అమ్మవారికి ఇష్టమైన పవిత్ర రంగు. అది శుభానికి, ధైర్యానికి, ప్రజా సంకల్పానికి ప్రతీక" అని వివరించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారి మధ్యనే ఉండాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు కవిత సూచించారు. ప్రజలతో మమేకమై పనిచేసే నాయకత్వానికే తమ పార్టీ ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. వచ్చే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ ఎన్నికల్లో అన్ని డివిజన్లలో తెలంగాణ రక్షణ సేన అభ్యర్థులను బరిలోకి దింపనున్నట్లు ప్రకటించిన కవిత, వరంగల్ గడ్డ నుంచే తమ విజయయాత్ర ప్రారంభమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల






ఆశీర్వాదం, యువత మద్దతుతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, విద్యార్థులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ జెండా ఆవిష్కరణ అనంతరం నాయకులు ప్రజలను ఉద్దేశించి పార్టీ సిద్ధాంతాలను వివరించగా, స్థానికులు కవితకు శుభాకాంక్షలు తెలియజేస్తూ తమ మద్దతు ప్రకటించారు.

**పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో.. టిఆర్ఎస్ పార్టీ చీఫ్ కవిత**

హనుమకొండ జిల్లా తరాలపల్లిలో నిర్వహించిన పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి నూతన వస్త్రాలను సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య కవితతో ప్రత్యేక పూజలు చేయించి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాన్ని స్వీకరించి, భక్తులతో ఆత్మీయంగా ముచ్చటించారు.

# కొడుకులు పట్టించుకోవడం లేదు
# వృద్ధురాలు ప్రజావాణిలోఫిర్యాదు

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**



జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణానికి చెందిన చౌటుపల్లి సత్తమ్మ, తన ఇద్దరు కొడుకులు, ఒక కూతురు తనను పట్టించుకోవడం లేదని, తనకు న్యాయం చేయాలని సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. భర్త మూడేళ్ల క్రితం మరణించగా వారసత్వంగా వచ్చిన ఆరు ఎకరాల భూమిని కొడుకులకు ఇచ్చినట్లు తెలిపారు. తన పేరుపై ఉన్న మరో రెండు ఎకరాల 15 కుంటల భూమిని కూడా కొడుకులు తమ పేర్లపైకి మార్చుకున్నారని, తన పోషణ బాధ్యత తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను వేడుకున్నారు.

# మార్కెట్ చైర్మన్ ను సన్మానించిన ఆరపేట వీడీసీ సభ్యులు



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
మెట్ పల్లి మండలం అరపేట గ్రామంలోని శివాలయంలో మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దర్శించుకున్నారు. అనంతరం విడిసి సభ్యులు వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగారం, విడిసి సభ్యులు లక్ష్మినర్సయ్య, హన్మండ్లు, దశరథం, కూన సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత హిందీ పండిత్ తిరుకోవెల నారాయణకు ఘన సన్మానం



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ZPHS) హిందీ పండిత్ తిరుకోవెల నారాయణకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది.
విద్యా రంగంలో ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా శనివారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేశారు.
ఈ నేపథ్యంలో, సోమవారం కల్వకోటలో తిరుకోవెల నారాయణను స్థానిక ప్రముఖులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ అదే లక్ష్మి రాజం, మాజీ ఉప సర్పంచ్ బన్న రాజేందర్, కాటుకం భూమేష్, భరత్ రాజు, మోసిన్ తదితరులు ఆయన విద్యా సేవలను కొనియాడారు.
జిల్లా స్థాయి అవార్డు సాధించి పాఠశాలకు, గ్రామానికి పేరు తెచ్చినందుకు ఈ సందర్భంగా నారాయణకు వారు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# నడికూడ జెడ్పీహెచ్ఎస్‌లో సరస్వతి మాత విగ్రహావిష్కరణ

▪ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం

**కరపత్రం ప్రతినిధి /నడికూడ, సెప్టెంబర్ 7**
నడికూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్, వాసవి క్లబ్, వనితా క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం శ్రీ సరస్వతి మాత విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. హనుమంతరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సౌభాగ్య సేవా సంకల్ప అధ్యక్షులు, మల్టీ డిస్ట్రిక్ట్ వాసవి క్లబ్ ప్రతినిధి శిద్దా వెంకట సూర్యప్రకాశ్ రావు హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా అంతర్జాతీయ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ గార్లపాటి శ్రీనివాసులు, ఇంటర్నేషనల్ డైరెక్టర్ గంపా సాంబమూర్తి, విగ్రహ దాత మాధంశెట్టి సంపత్--శోభారాణి దంపతులు, జిల్లా గవర్నర్ మంచాల విజయ్‌కుమార్, గుండి వాసుదేవ్, యాదా సంతోష్, గౌరిశెట్టి విజయ్‌కుమార్-- సంతోషిణి, గౌరిశెట్టి ప్రశాంత్--స్నేహితతో పాటు వాసవి క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి వెంకట సూర్యప్రకాశ్ రావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించడంతో పాటు మంచి విలువలను అలవరచుకోవాలని సూచించారు. అనంతరం గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 1,000 చొప్పున మొత్తం రూ. 5,000 నగదు ప్రోత్సాహక బహుమతులను వెంకట సూర్యప్రకాశ్ రావు, గార్లపాటి శ్రీనివాసులు చేతుల మీదుగా అందజేశారు. ఈ పురస్కారాలను ఎం. రామ్ చరణ్, బి. బన్ని, ఏ.పి.ఎం.ఏ., ఎం. విష్ణు, కె. అర్చన అందుకున్నారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు దొంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ వాసవి క్లబ్ పాఠశాలకు అందిస్తున్న సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వాటర్ ప్యూరిఫైర్ ఏర్పాటు చేయడం, ఆధ్యాత్మిక చైతన్యం కోసం సరస్వతి మాత విగ్రహాన్ని ప్రతిష్ఠించడం, విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో



ప్రతిభా పురస్కారాలను అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విగ్రహ దాతలు, వాటర్ ప్యూరిఫైర్ దాతలు, ప్రతిభా పురస్కారాల దాత మాధంశెట్టి సంపత్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఏపీసీ చైర్‌పర్సన్ స్రవంతి, ఉపాధ్యాయులు జయ, శివచేతన్, సుమలత, శ్రవణ్, శ్రీనివాస్ రెడ్డి, సుభాని, శివకుమార్, తిరుపతి, షరీఫ్, రాజు, ఉపేంద్రతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# జనసందోహం నియంత్రణపై పోలీసులకు శిక్షణ

పండగలు,జాతరలు, ఊరేగింపుల సందర్భంగా భారీగా తరలివచ్చే జనసందోహాన్ని సమర్థంగా నియంత్రిస్తూ,ప్రజలతో పోలీసులు వ్యవహరించాల్సిన తీరుపై పోలీస్ శిక్షకులకు నాలుగు రోజుల శిక్షణ తరగతులు సోమవారం మడికొండలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో ప్రారంభమయ్యాయి. వరంగల్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్లతో పాటు మహబూబాబాద్,భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు,కానిస్టేబుళ్లు కలిపి మొత్తం 43 మంది శిక్షణకు హాజరయ్యారు. పండగలు, జాతరలు, ఊరేగింపుల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణ, జనసందోహం నియంత్రణ,ప్రజలతో సమన్వయంతో వ్యవహరించే విధానాలపై తరగతి గదుల్లో బోధించడంతో పాటు ప్రాక్టికల్‌గా శిక్షణ ఇస్తున్నారు.

# హుజురాబాద్ ఆర్టీసీ డిపోకు నూతన సారథి డిపో మేనేజర్‌గా టి. దయాకర్ బాధ్యతల స్వీకరణ

» ఫలక్‌నుమా డిపోలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా గతంలో సేవలు
» బదిలీపై హుజురాబాద్‌కు వచ్చిన దయాకర్
» ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యంగా ముందుకు

కరపత్రం ప్రతినిధి హుజురాబాద్: సెప్టెంబర్ 7
కరీంనగర్ జిల్లా హుజురాబాద్ ఆర్టీసీ బస్ డిపోకు నూతన డిపో మేనేజర్‌గా టి. దయాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు హుజురాబాద్ డిపో మేనేజర్‌గా విధులు నిర్వహించిన రవీంద్రనాథ్ బదిలీలో భాగంగా మరో డిపోకు వెళ్లడంతో ఆయన స్థానంలో టి. దయాకర్‌ను నియమించారు. దీంతో హుజురాబాద్ ఆర్టీసీ డిపోకు కొత్త మేనేజర్‌గా దయాకర్ బాధ్యతలు చేపట్టారు.ఫలక్‌నుమా డిపోలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా సేవలుటి. దయాకర్‌కు ఆర్టీసీ విభాగంలో విధి నిర్వహణపై అనుభవం ఉంది. గతంలో హైదరాబాద్‌లోని ఫలక్‌నుమా డిపోలో అసిస్టెంట్ ఇంజనీర్ (మెయింటెనెన్స్)గా విధులు నిర్వహించారు. బస్సుల సాంకేతిక నిర్వహణ, వాహనాల ఫిట్‌నెస్, మరమ్మతులు, నిర్వహణకు సంబంధించిన అంశాల్లో పనిచేసిన అనుభవంతో ప్రస్తుతం హుజురాబాద్ డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

**రవీంద్రనాథ్‌కు బదిలీ**

హుజురాబాద్ డిపో మేనేజర్‌గా ఇప్పటివరకు పనిచేసిన రవీంద్రనాథ్ విధి నిర్వహణలో భాగంగా మరో డిపోకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో దయాకర్ బాధ్యతలు చేపట్టడంతో డిపోలో పరిపాలనా బాధ్యతలు కొత్త మేనేజర్ చేతుల్లోకి వెళ్లాయి. ఈ సందర్భంగా డిపో సిబ్బంది నూతన మేనేజర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రయాణికుల సేవలపై ప్రత్యేక దృష్టి**

హుజురాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో ప్రతిరోజూ అనేక మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సులపై ఆధారపడుతున్నారు. పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, మండలాలు, జిల్లా కేంద్రాలకు వెళ్లే ప్రయాణికులకు ఆర్టీసీ ప్రధాన రవాణా వ్యవస్థగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బస్సులను సమయపాలనతో నడిపించడం, బస్సుల నిర్వహణను పర్యవేక్షించడం, ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించడం డిపో మేనేజర్‌పై ప్రధాన బాధ్యతగా ఉంది.

**బస్సుల నిర్వహణకు ప్రాధాన్యం**



మెయింటెనెన్స్ విభాగంలో పనిచేసిన అనుభవం ఉన్న దయాకర్ బాధ్యతలు చేపట్టడంతో హుజురాబాద్ డిపోలో బస్సుల సాంకేతిక నిర్వహణపై మరింత పర్యవేక్షణ ఉండే అవకాశం ఉంది. బస్సులు క్రమం తప్పకుండా తనిఖీ చేయడం, అవసరమైన మరమ్మతులను సకాలంలో చేపట్టడం, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**సిబ్బందితో సమన్వయంతో ముందుకు**

డిపో సజావుగా నిర్వహించడంలో డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ సిబ్బంది, ఇతర ఉద్యోగుల పాత్ర కీలకం. నూతన మేనేజర్ దయాకర్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ డిపో కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లనున్నారు. సిబ్బంది సమస్యలను తెలుసుకుని వాటి




పరిష్కారానికి కృషి చేయడంతో పాటు విధుల్లో క్రమశిక్షణ, సమయపాలనకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది.

**ప్రయాణికుల సమస్యలకు పరిష్కారం దిశగా..**

బస్సుల రాకపోకలు, సమయపాలన, బస్సుల అందుబాటు, ప్రయాణికుల రద్దీ తదితర అంశాలపై ప్రయాణికుల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పండుగలు, వారాంతాలు, విద్యాసంస్థలు ప్రారంభమయ్యే సమయాల్లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను అందుబాటులో ఉంచడం డిపోకు కీలకంగా మారనుంది.

**హుజురాబాద్ డిపో అభివృద్ధిపై ఆశలు**

నూతన డిపో మేనేజర్‌గా టి. దయాకర్ బాధ్యతలు స్వీకరించడంతో హుజురాబాద్ ఆర్టీసీ డిపో అభివృద్ధిపై ప్రయాణికులు, సిబ్బంది ఆశలు వ్యక్తం చేస్తున్నారు. తనకు ఉన్న అనుభవాన్ని ఉపయోగించుకుని డిపో నిర్వహణను మరింత పటిష్టం చేయడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.హుజురాబాద్ ఆర్టీసీ డిపోకు నూతన మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన టి. దయాకర్‌కు సిబ్బంది, ప్రయాణికులు శుభాకాంక్షలు తెలిపారు.

# తాతా మధు దళితులకు క్షమాపణ చెప్పాలి

◆ కాంగ్రెస్ ఎస్సీ సెల్ నేత దొడ్డే శ్రీకాంత్

కరపత్రం ప్రతినిధి జమ్మికుంట సెప్టెంబర్ 7
కరీంనగర్: బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధు అసెంబ్లీ స్పీకర్‌పై చేసిన అనుచిత, అమర్యాదకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ, ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ దొడ్డే శ్రీకాంత్ తెలిపారు. స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవుల్లో ఒకటని, ఆ పదవిలో ఉన్న వ్యక్తిని కించపరిచేలా మాట్లాడటం రాజ్యాంగ విలువలను, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను అవమానించడమేనని ఆయన పేర్కొన్నారు.దళితులు ఉన్నత పదవుల్లో కొనసాగడాన్ని సహించలేని బీఆర్ఎస్ నాయకుల కుల అహంకారం తాతా మధు వ్యాఖ్యలతో బయటపడిందని శ్రీకాంత్ ఆరోపించారు. దళితుల సంక్షేమం పేరుతో రాజకీయాలు చేసి, అదే దళిత సమాజానికి చెందిన



వ్యక్తులను అవమానించడం బీఆర్ఎస్ నాయకుల ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.సాధారణ దళిత కుటుంబం నుంచి వచ్చి స్పీకర్ స్థాయికి ఎదిగిన వ్యక్తిని విమర్శించడం కాకుండా గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్పీకర్‌ను కించపరిచే వ్యాఖ్యలు రాష్ట్రంలోని దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ తాతా మధుతో పాటు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 24 గంటల్లో బహిరంగంగా స్పీకర్‌కు, దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని శ్రీకాంత్ డిమాండ్ చేశారు. అలాగే తాతా మధుపై బీఆర్ఎస్ పార్టీ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.లేనిపక్షంలో కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. దళితుల ఆత్మగౌరవం కోసం ఎంతవరకైనా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని దొడ్డే శ్రీకాంత్ స్పష్టం చేశారు.

# నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు

●కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సంక్షేమం..
సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేశిని కోటి

కరపత్రం ప్రతినిధి జమ్మికుంట సెప్టెంబర్ 7
జమ్మికుంట: నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేశిని కోటి అన్నారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి ప్రాంతం నాలుగో వార్డులో లాడే శ్యామ్ రావు దంపతులు నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి దేశిని కోటి హాజరై శ్యామ్ రావు కుటుంబాన్ని అభినందించారు.ఈ సందర్భంగా దేశిని కోటి మాట్లాడుతూ.. గత పదేళ్లుగా సొంత ఇల్లు నిర్మించుకోవాలనే కోరిక ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో శ్యామ్ రావు కుటుంబం అద్దె ఇల్లు, ఇతర ఇబ్బందులతో కాలం గడపాల్సి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా శ్యామ్ రావుకు ఇల్లు మంజూరు కావడం సంతోషకరమన్నారు.హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు సహకారంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరై, కేవలం ఆరు నెలల్లోనే



ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకుని ఈరోజు గృహప్రవేశం చేసుకోవడం అభినందనీయమన్నారు. ఏళ్ల తరబడి కన్న సొంతింటి కల నెరవేరడంతో శ్యామ్ రావు దంపతులు ఆనందంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేయడం వారి సంతోషానికి నిదర్శనమని తెలిపారు.తమ జీవితంలో సొంతింటి కలను నిజం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఇందిరమ్మ ఇల్లు మంజూరులో సహకరించిన హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబుకు శ్యామ్ రావు దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భావోద్వేగానికి గురైన శ్యామ్ రావు దంపతులు "ఇన్నాళ్లుగా కన్న కల ఈరోజు నిజమైంది" అంటూ కంటతడి పెట్టారు.నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా అండగా ఉంటుందని దేశిని కోటి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల్లో చెప్పే ప్రభుత్వం కాదని.. చేతల్లో చేసి చూపించే ప్రజా ప్రభుత్వమని పేర్కొన్నారు. పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.హుజురాబాద్ నియోజకవర్గంలో వొడితల ప్రణవ్ బాబు నాయకత్వంలో నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేతతో పాటు పట్టణాలు, గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని దేశిని కోటి తెలిపారు.రానున్న రోజుల్లో హుజురాబాద్ నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ, పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న వొడితల ప్రణవ్ బాబు వంటి నాయకులను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో 18వ వార్డు కౌన్సిలర్ కుడాడి తిరుపతి, మాజీ కౌన్సిలర్ బొంగోని వీరన్న, పట్టణ కాంగ్రెస్ నాయకులు పంజాల అజయ్, నాలుగో వార్డు అధ్యక్షులు టెంకురాల కిషోర్, రాజేష్, లాడే రామారావు, సాయినాథ్ యూత్ అసోసియేషన్ నాయకులు కందారపు రాజేష్, బలబత్తుల శ్రీకాంత్, గోపి, శ్రీధర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై అసభ్య వ్యాఖ్యలు అప్రజాస్వామికం

● ఎమ్మెల్సీ తాతా మధు తీరును తీవ్రంగా ఖండించిన మల్లన్నపల్లి సర్పంచ్ పసునూటి శ్రీనివాస్

కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట సెప్టెంబర్ 7
ఇల్లందకుంట: శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు అసభ్య పదజాలంతో, అమర్యాదపూర్వకంగా చేసిన వ్యాఖ్యలను కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం మల్లన్నపల్లి గ్రామ సర్పంచ్ పసునూటి శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. గౌరవప్రదమైన రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్య వ్యవస్థకు, శాసనసభ గౌరవానికి అవమానకరమని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ పసునూటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో శాసనసభకు, స్పీకర్



పదవికి ఎంతో ప్రత్యేకమైన గౌరవం ఉంటుందని అన్నారు. అలాంటి అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిపై అసభ్య పదజాలం ఉపయోగించడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించారు.ఎమ్మెల్సీగా ఉన్న తాతా మధు తన హోదాకు తగిన విధంగా వ్యవహరించాల్సి ఉండగా, స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం తీవ్రంగా అభ్యంతరకరమని శ్రీనివాస్ అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపుతాయని, శాసనసభ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉంటాయని పేర్కొన్నారు.మల్లన్నపల్లి గ్రామ ప్రజల తరఫున ఎమ్మెల్సీ తాతా మధు తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని, భవిష్యత్తులో ఇలాంటి అసభ్యకరమైన వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని హెచ్చరిస్తున్నామని సర్పంచ్ పసునూటి శ్రీనివాస్ తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థలను, ప్రజాస్వామ్య విలువలను ప్రతి ప్రజాప్రతినిధి గౌరవించాలని ఆయన కోరారు.

# పిఆర్సి బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పిడుగురాళ్ల వైద్య కళాశాల వైద్యులు నిరసన

● 2016 నుంచి రావాల్సిన పిఆర్సి బకాయిలు వెంటనే విడుదల చేయాలని వైద్య కళాశాల పిడుగురాళ్ల వైద్యులు నిరసన

కరపత్రం ప్రతినిధి పిడుగురాళ్ల, సెప్టెంబర్ 07 :




రాష్ట్రవ్యాప్తంగా బోధనా ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులు తమకు రావాల్సిన వేతన సవరణ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సోమవారం ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు వైద్యులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిర సన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (జి డి ఏ ఏ పి ) పిడుగురాళ్ల వైద్య కళాశాల సెక్రటరీ డాక్టర్ రంగయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న డాక్టర్లకు యూజీసీ అరియర్స్ 2016 నుంచి చెల్లించాల్సి ఉండగా, ఐదేళ్ల జాప్యం తర్వాత అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 2021 సంవత్సరంలో అమలు చేసిందన్నారు. అందువల్ల 2016 నుంచి 2021 వరకు న్యాయబద్ధంగా రావాల్సిన బకాయిలను నేటికీ చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో అనేకసార్లు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాలేదు. నాటి ప్రభుత్వమే మెమో నెంబర్ 2607834/ ఏ 1 /2024 ద్వారా బకాయిలు చెల్లింపు సాధ్యం కాదని స్పష్టం చేయడం దారుణమన్నారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న మెడికల్ కళాశాల డాక్టర్లకు తీవ్ర అన్యాయం, ఆర్థిక నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దిగివచ్చి బకాయిలు చెల్లించాలని వైద్యులు మనవి చేస్తున్నారు. లేనిపక్షంలో ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని పిడుగురాళ్ల వైద్య కళాశాల వైద్యులందరూ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జి డి ఏ ఏ పి ప్రెసిడెంట్ డాక్టర్ రవిశంకర్, జనరల్ సెక్రటరీ వై ఎ సి రంగయ్య, ట్రెజరర్ డాక్టర్. సత్యనారాయణ మిగతా సీనియర్ నాయకులు, డాక్టర్. త్రినాథ్ కుమార్, సీనియర్ వైద్యులు డాక్టర్. భాను కుమార్, డాక్టర్. సుధాకర్ బాబు, డాక్టర్. విజయలక్ష్మి, డాక్టర్. దేవసేన, డాక్టర్. సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# తాతా మధు నోరు అదుపులో పెట్టుకోవాలి
## కాంగ్రెస్ నాయకుడు పంతాటి రవీందర్

కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట: సెప్టెంబర్ ఏడు



కరీంనగర్ జిల్లా జమ్మికుం ఇల్లంతకుంట మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు పంతాటి రవీందర్ మాట్లాడుతూ గౌరవప్రదమైన రాజ్యాంగ పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు అసభ్య పదజాలంతో, అమర్యాదకరంగా మాట్లాడటం ప్రజాస్వామ్య వ్యవస్థకు, శాసనసభ గౌరవానికి అవమానకరమని కాంగ్రెస్ నాయకుడు పంతాటి రవీందర్ అన్నారు. స్పీకర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలంలో కాంగ్రెస్ నాయకుడు పంతాటి రవీందర్ మాట్లాడుతూ.. కేవలం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల మెప్పు పొందేందుకు ఇతరులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు హుందాగా, బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన అవసరం ఉందని సూచించారు.తాతా మధు గతంలో ఎక్కడ ఉన్నారు, ప్రజా జీవితంలో ఆయన చేసిన కార్యక్రమాలు ఏమిటి, ఎమ్మెల్సీగా ప్రజలకు అందించిన సేవలు ఏమిటి అనే విషయాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని రవీందర్ అన్నారు. పదవిలో ఉన్న వ్యక్తులు ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన బాధ్యత ఉందని తెలిపారు.ఇకనైనా నోరు అదుపులో పెట్టుకుని, గౌరవప్రదమైన పదవులపై మాట్లాడేటప్పుడు సంయమనం పాటించాలని తాతా మధును పంతాటి రవీందర్ హెచ్చరించారు. శాసనసభ స్పీకర్ పదవి వ్యక్తిగత రాజకీయాలకు అతీతమైన అత్యున్నత రాజ్యాంగ పదవిగా భావించాలని, ఆ పదవిని కించపరిచేలా మాట్లాడటం సముచితం కాదన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో భిన్నాభిప్రాయాలు ఉండటం సహజమే అయినప్పటికీ, విమర్శలు హద్దులు దాటకూడదని రవీందర్ పేర్కొన్నారు. రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడే విధంగా ప్రతి రాజకీయ నాయకుడు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు.